# సాక్షి
## నిజామాబాద్
గురువారం । 2 । ఫిబ్రవరి । 2023





**సమస్యలు పరిష్కరించాలి**
ముదక్‌పల్లిలోని గిరిజన సంక్షేమ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు ధర్నా నిర్వహించారు.
- 18లో ▸



**అడ్డుగా ఉన్నాడని..**
అంకోల్ తండాలో జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిందని పేర్కొన్నారు.
- 18లో ▸

**వాతావరణం**
గరిష్టం/కనిష్టం
31.0 /20.0
పొగ మంచు కురుస్తుంది. చలితీవ్రత తగ్గొచ్చు. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది.

## న్యూస్‌రీల్

### తెయూ లా కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రసన్నరాణి



**తెయూ(డిచ్‌పల్లి):** తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాల(లా కాలేజీ) ప్రిన్సిపాల్‌గా అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.ప్రసన్నరాణి నియమితులయ్యారు. తెయూ వీసీ డి.రవీందర్ ఆదేశాల మేరకు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ విద్యావర్ధిని నియామక ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం సాయంత్రం వీసీ రవీందర్ చేతుల మీదుగా ప్రసన్నరాణి నియామకపత్రం అందుకున్నారు. తనకు ఈ అవకాశం కల్పించిన వీసీ, రిజిస్ట్రార్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

### గంటలో సదరం స్లాట్లు బుకింగ్

**ఇందూరు(నిజామాబాద్ అర్బన్):** దివ్యాంగుల కోసం ఏర్పాటు చేస్తున్న సదరం క్యాంపులకు భారీ డిమాండ్ ఏర్పడింది. సాట్లు విడుదల చేసిన నిముషాల వ్యవధిలోనే బుకై్కపోతున్నాయి. దీంతో చాలామంది దివ్యాంగులు నిరాశకు గురవుతున్నారు. గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఈ నెల 8, 15 తేదీల్లో సదరం క్యాంపులు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు 1వ తేదీ నుంచి మీ సేవ కేంద్రాల్లో స్లాట్లు బుక్ చేసుకోవాలని సూచించారు. అయితే, బుధవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో సాట్లు విడుదల కాగా, గంటలోపే స్లాట్లన్నీ బుక్కయ్యాయి. నాలుగైదు కేటగిరీలు కలిపి ప్రతి క్యాంపునకు 80 సాట్లు బుక్కయ్యేలా అధికారులు సాట్లను రిలీజ్ చేస్తున్నారు. ఆర్థో కేటగిరీకి 70శాతం స్లాట్లను కేటాయిస్తారు. అయితే, ఈ నెలలో రెండు క్యాంపులు నిర్వహిస్తుండగా మొత్తం 160 సాట్లు గంట వ్యవధిలోనే జిల్లా వ్యాప్తంగా బుక్కయ్యాయి. మార్చి, ఏప్రిల్‌లలో నిర్వహించే క్యాంపులకు తేదీలు ఖరారు కాకపోవడంతో సాట్లు కేటాయించలేదు. సాట్ల సంఖ్యను పెంచడం లేదా అదనపు తేదీలను నిర్ణయించాలని జిల్లాలోని దివ్యాంగులు అధికారులను కోరుతున్నారు.

### వైద్యులు నిర్లక్ష్యంగా ఉండొద్దు



**మాక్లూర్:** కంటి వెలుగు వైద్య శిబిరాల్లో వైద్యులు నిర్లక్ష్యంగా ఉండకూడదని ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. కల్లెడిలో కొనసాగుతున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని బుధవారం ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కంటి జబ్బులతో బాధపడుతూ కూడా ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో పేదలు ఉన్నారని, అలాంటి వారికి సీఎం కేసీఆర్ చేపట్టిన కంటి వెలుగు శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. అవసరమైన వారికి ఆపరేషన్ల నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి సిఫార్సు చేయాలన్నారు. అలాగే కంటి అద్దాలు అందించటంలో అలసత్వం వద్దన్నారు. అనంతరం గ్రామంలో కొనసాగుతున్న బీటీ రోడ్డు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ మాస్త ప్రభాకర్, పార్టీ మండల అధ్యక్షుడు బడుగు సత్యం, వైస్ ఎంపీపీ సుక్కి సుజాత సుధాకర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# వ్యవసాయానికి ప్రాధాన్యత



- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లా రైతులు
- జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టుపై ప్రజల ఆశలు
- పన్ను మినహాయింపు పెంపుతో ఉద్యోగులకు ఊరట
- కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో బుధవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. ఎన్నికలకు ముందు చివరి రెగ్యులర్ బడ్జెట్ కావడంతో దీనిపై అందరిలో ఆసక్తి నెలకొంది. బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇవ్వడంతో వ్యవసాయ రంగంలో ముందంజలో ఉన్న నిజామాబాద్ రైతాంగం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలో పలువురు రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం బడ్జెట్‌లో దేశంలో కోటి మంది రైతులను ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు చెప్పడంతో హర్షం వ్యక్తమవుతోంది. వ్యవసాయ, అనుబంధ రుణాలకు సంబంధించి రూ. 20లక్షల కోట్లు కేటాయింపులు చూపడంతో రైతులు హర్షిస్తున్నారు.

**వేతన జీవులకు..**
ఆదాయ పన్నును రూ. 7 లక్షల వరకు మినహాయింపు ఇస్తున్నట్లు ఆర్థిక శాఖ మంత్రి ప్రకటించడంతో ఉద్యోగులు ఊరట చెందారు. దీంతో జిల్లాలోని వేల మంది ఉద్యోగులు పన్ను మినహాయింపు పొందనున్నారు. కేంద్ర నిర్ణయంతో ఉద్యోగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**ఎయిర్‌పోర్టు కోసం..**
బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక మంత్రి దేశవ్యాప్తంగా 50 విమానాశ్రయాలు, హెలీప్యాడ్‌లు నిర్మాణం చేస్తామని చెప్పడంతో జక్రాన్‌పల్లి ఎయిర్‌పోర్టు విషయమై జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టుకు భూమి ఇవ్వాల్సి ఉంది. బడ్జెట్ రైల్వేకు రూ. 2.41 లక్షల కోట్లు కేటాయింపులు చేయడంతో జిల్లాలో కొత్త ట్రాక్‌లపై ఆశలు కలుగుతున్నాయి.

### కొన్ని రాష్ట్రాలకే ప్రయోజనం



బడ్జెట్ కొన్ని ఉత్తరాది రాష్ట్రాలకే మేలు కలిగించేదిలా ఉంది. దక్షిణాది రాష్ట్రాల నుంచి భారీగా జీఎస్టీ రూపంలో ఆదాయం పొందుతున్న కేంద్ర ప్రభుత్వం నిధుల కేటాయింపుల్లో మాత్రం వివక్ష చూపిస్తోంది. తెలంగాణ నుంచి భారీగా జీఎస్టీ ఆదాయం పొందుతున్న కేంద్రం తెలంగాణకు ఒక్క పెద్ద ప్రాజెక్టు, ఒక్క ప్రతిష్టాత్మక విద్యాసంస్థ కూడా కేటాయించలేదు.
– బాజిరెడ్డి గోవర్ధన్, ఆర్టీసీ చైర్మన్

### మహిళా సాధికారతకు పెద్దపీట



ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక శక్తిగా ఎదిగింది. రైల్వేకు రూ. 2.40లక్షల కోట్లు కేటాయించారు. కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి పెద్దపీట వేశారు. విశ్వకర్మ కౌశల్ పథకంలో భాగంగా చేనేత కార్మికులకు చేయూత అందిస్తారు.
– బస్వా లక్ష్మీనర్సయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

### ఎకానమీ మరింత పుంజుకుంటుంది



బడ్జెట్‌లో క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్‌ను మౌలి క వసతుల అభివృద్ధిపై పెడుతుండడం వల్ల వడ్డీ రేట్లు పెంచకుండానే జీడీపీలో లోటును భర్తీ చేస్తున్నారు. 6.4 శాతం ఉన్న జీడీపీ లోటును 5.9శాతానికి తగ్గించే ప్రయత్నం చేశారు. ఆదాయపన్ను రూ. 7 లక్షల వరకు మినహాయింపు ఇవ్వడంతో ప్రజల వద్ద అదనంగా ఉన్న డబ్బుతో కొనుగోలు శక్తి పెరిగి మార్కెట్‌లో తిరిగి ఎకానమీ పెరుగుతుంది. ఒకవేళ ఆ డబ్బును బ్యాంకుల్లో దాచుకుంటే బ్యాంకుల మూలధనం పెరుగుతుంది. దీంతో వడ్డీ రేట్లు తగ్గుతాయి. తద్వారా ద్రవ్యోల్బణం తగ్గుతుంది.
– నల్ల దినేశ్‌రెడ్డి, నిజామాబాద్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు

### నిరాశ పరిచిన బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు మరోసారి నిరాశ పర్చింది. తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలపై ఎలాంటి నిధులు కేటాయించలేదు. కర్ణాటకలో ఎన్నికలు ఉన్నాయని, ఆ రాష్ట్రంపై కేంద్రం ఉదారత చూపింది. తెలంగాణలో ఎన్నికల దృష్ట్యా నిజామాబాద్‌లో పసుపు బోర్డుకు నిధులు కేటాయిస్తారని భావించినా నిరాశే మిగిలింది. ఈ బడ్జెట్‌తో పేద, మధ్యతరగతి ప్రజలకు ఒరిగేదిమీ లేదు.
– మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు

## సర్టిఫికెట్ల పరిశీలన



డీఈవో కార్యాలయంలో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరైన ఉపాధ్యాయులు

**నిజామాబాద్‌అర్బన్:** జిల్లా విద్యాశాఖలో పదోన్నతులకు సంబంధించి బుధవారం సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభమైంది. స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 410 మందికి ఉదయం నుంచి సాయంత్రం వరకు సర్టిఫికెట్లను పరిశీలించారు. స్కూల్ అసిస్టెంట్లు కేడర్ల వారీగా, పీజీహెచ్‌ఎంకు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. నేడు ఎస్జీటీల సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందే వారికి సీనియారిటీ జాబితా ప్రకారం 1:2 ప్రకారం వెరిఫికేషన్ చేయనున్నారు. సుమారు 620 మంది ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు.

సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌లో సర్వీస్ వివరాలు, రిమార్కులు, వైకల్య ధ్రువపత్రాలను ఉన్నత చదువుకు సంబంధించిన సర్టిఫికెట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. అలాగే గతంలో సస్పెన్షన్, మెమోల జారీ వంటి కారణాలు ఉంటే పరిశీలిస్తున్నారు. పదోన్నతులకు సంబంధించి వెరిఫికేషన్ షెడ్యూల్ ప్రకారం చేస్తామని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తెలిపారు. వెరిఫికేషన్ పూర్తయిన తర్వాత పదోన్నతికి అర్హులైన వారి జాబితాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రూపొందిస్తామన్నారు.

# జిల్లాతో అనుబంధం మరువలేనిది



కలెక్టర్ దంపతులను సన్మానిస్తున్న సీపీ నాగరాజు



ఉద్యోగులతో కలెక్టర్ నారాయణరెడ్డి దంపతులు, అడిషనల్ కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా అధికారులు

- అందరి సహకారంతో అన్ని రంగాల్లో ముందంజ
- వీడ్కోలు సమావేశంలో కలెక్టర్ నారాయణరెడ్డి
- అందరినీ వదిలి వెళ్లడం బాధగా ఉందని భావోద్వేగం

**సుభాష్‌నగర్:** నిజామాబాద్‌లో మూడేళ్లకుపైగా విధులు నిర్వహించిన సందర్భంగా జిల్లాతో పెనవేసుకున్న అనుబంధం ఎన్నటికీ మర్చిపోలేనని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగ, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాల నాయకులు, వివిధ సంఘాల బాధ్యులు కలెక్టర్‌ను సన్మానించారు. ఆయన పనితీరు, ఆయనతో కలిసి పనిచేసిన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ జిల్లాను విడిచి వెళ్తుండడం బాధగా ఉన్నప్పటికీ, ఉద్యోగులకు విధినిర్వహణలో బదిలీలు సహజమని ఒకింత భావోద్వేగానికి లోనయ్యారు. కలెక్టర్‌గా తాను జిల్లాలో బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి కిందిస్థాయి ఉద్యోగి మొదలుకుని జిల్లాస్థాయి అధికారులు ఎంతగానో సహకరించారన్నారు. వారి తోడ్పాటుతోనే జిల్లాను ధాన్యం సేకరణ, హరితహారం, ఉపాధిహామీ వంటి అనేక అంశాల్లో ముందంజలో నిలపగలిగామని పేర్కొన్నారు. పల్లె ప్రగతి స్వచ్ఛ సర్వేక్షన్ విభాగంలో జిల్లా జాతీయస్థాయిలో గుర్తింపు సాధించిందన్నారు. వ్యాక్సినేషన్, క్షయ నిర్మూలనలోనూ అవార్డులు వచ్చాయని గుర్తుచేశారు. అన్నింటికీ మించి కరోనా సంక్షోభంతో భయాందోళనలతో కూడిన పరిస్థితి నెలకొన్న సమయంలో అంగన్‌వాడీలు, ఆశ వర్కర్లు సహా వైద్యాధికారులు, సిబ్బంది పారా మెడికల్ స్టాఫ్ అహర్నిశలు శ్రమిస్తూ, ప్రజలకు తాము వెన్నంటి ఉన్నామనే భరోసా కలిగించారని ప్రశంసించారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత తదితర ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లా యంత్రాంగానికి అవసరమైన అదనపు వనరులు సమకూర్చుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలందించామని కలెక్టర్ నారాయణరెడ్డి వారికి కృతజ్ఞతలు తెలిపారు. సీపీ నాగరాజు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్ తదితరులు కలెక్టర్ నారాయణరెడ్డితో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తు చేశారు. సమావేశంలో కలెక్టర్ సతీమణి మనీష, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ అలుక కిషన్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, ప్రభుత్వ అధికారుల సంఘం అధ్యక్షుడు రాములు, పీఆర్‌టీయూ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

# కుంభమేళాను తలపించేలా..

- ఇందూరు జిల్లాలో సాధు సమ్మేళనం నిర్వహించడం గొప్పవిషయం
- శ్రీపీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద
- పలుగుట్ట శ్రీ కేదారేశ్వర ఆశ్రమంలో ముగిసిన మహాసభలు

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** ఇందూరు జిల్లాలో కుంభమేళాను తలపించేలా సాధు సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమని శ్రీ పీఠం అధిపతి స్వామి పరిపూర్ణానంద అన్నారు. నందిపేట మండలం పలుగుట్ట శ్రీకేదారేశ్వర ఆశ్రమంలో జనవరి 27 నుంచి నిర్వహించిన అఖిలాంధ్ర సాధు పరిషత్ సమ్మేళనం బుధవారం ముగిసింది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని పలువురు పీఠాధిపతులు, సాధు సంతులు మహాసభల్లో పాల్గొన్నారు. మంగి రాములు మహరాజ్ ఆధ్వర్యంలో అఖిలాంధ్ర సాధు పరిషత్ అధ్యక్షురాలు మాతా పరావిద్యానందగిరి స్వామి అధ్యక్షతన సమ్మేళనం విజయవంతంగా ముగిసింది. చివరిరోజు సభలో స్వామి పరిపూర్ణానంద ప్రవచనం చేశారు. 34 ఏళ్ల తరువాత జిల్లాలో సమ్మేళనం నిర్వహించడం జరిగిందన్నారు. గురువుల ఆదేశాలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా పాటిస్తే మేలు కలుగుతుందన్నారు. కర్మల నుంచి ఉపశమనం పొందాలంటే గురుసేవే మార్గమన్నారు. అదేవిధంగా భారతదేశాన్ని భరతమాత అంటున్నామంటే మాతకు ఎంతటి ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఇంత బృహత్తర సమ్మేళనం నిర్వహించిన మంగి రాములు మహరాజ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సాధు పరిషత్ ముగింపు సందర్భంగా వచ్చే ఏడాది 58వ అఖిలాంధ్ర సాధు పరిషత్ సమ్మేళనాన్ని మహారాష్ట్రలోని పండరిపూర్‌లో నిర్వహించేందుకు నిర్ణయించారు. అనంతరం సమ్మేళనానికి వచ్చిన స్వామీ జీలు, సాధువులందరికీ మంగి రాములు మహారాజ్ ఆధ్వర్యంలో పాదపూజ, సన్మానాలు చేశారు. కార్యక్రమంలో తిరుమల హథీ రాంజీ మఠానికి చెందిన కృష్ణదాస్ తదితరులు పాల్గొన్నారు.



పలుగుట్టలో పరిపూర్ణానంద స్వామికి స్వాగతం పలుకుతున్న మంగి రాములు మహరాజ్

# ప్రభుత్వ బడుల్లో కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు

- విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి
- అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

**వేల్పూర్:** మన ఊరు–మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్కూళ్లను మించిన సౌకర్యాలు సమకూరాయని జిల్లా అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా పేర్కొన్నారు. వేల్పూర్ మండలం రామన్నపేట్‌లో బుధవారం ఆమె మన ఊరు–మన బడి కార్యక్రమం కింద రూ. 6.21 లక్షలతో నిర్మించిన ప్రాథమిక పాఠశాల అదనపు గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మన ఊరు–మనబడి కింద స్కూళ్లకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తోందన్నారు. వీటిని ఉపయోగించుకొని విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించాలని కోరారు. అంతకుముందు సరస్వతి విగ్రహానికి పూజలు నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, ఎంపీపీ బీమజమున, సర్పంచ్ వీణ పురుషోత్తంరెడ్డి, ఎంపీటీసీ శోభన్‌రెడ్డి, తహసీల్దార్ రాజేందర్, ఎంపీడీవో కమలాకర్, ఎంఈవో వనజ పాల్గొన్నారు.



మన ఊరు-మన బడి కార్యక్రమంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా

# కొత్త కలెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజీవ్‌గాంధీ హనుమంతు

- స్వాగతం పలికిన జిల్లా అధికారులు

**సుభాష్‌నగర్:** కలెక్టర్‌గా రాజీవ్‌గాంధీ హనుమంతు బుధవారం కొత్త కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్దకు చేరుకున్న నూతన జిల్లా పాలనాధికారికి అధికారులు స్వాగతం పలికారు.

అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, చంద్రశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా తదితరులతో భేటీ అయ్యి జిల్లా స్థితిగతులు, స్థానిక పరిస్థితులపై చర్చించారు. అంతకుముందు కొత్త కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జిల్లా పాలనాధికారిని ఆయన చాంబర్‌లో వివిధ శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పరిచయం చేసుకున్నారు. అదనపు కలెక్టర్లతో పాటు ఆర్డీవోలు రవి, శ్రీనివాస్, రాజేశ్వర్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్‌డీవో చందర్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అలుక కిషన్, అమృత్‌కుమార్, చిట్టి నారాయణరెడ్డి, రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు రమణ్‌రెడ్డి, నాయకులు వేణు, సతీశ్‌రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌గౌడ్, అధికారులు, నాయకులు కలెక్టర్‌కు బొకేలు ఇచ్చి స్వాగతం పలికారు.

# ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్):** జిల్లాలో ప్రసిద్ధి పొందిన డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో శ్రీ సీతారామచంద్ర స్వామి సప్తాహిక ధ్వజారోహణ తిరుక్కళ్యాణోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు ఆలయ ప్రధానార్చకులు సుమిత్‌శర్మ దేశ్‌పాండే ఆధ్వర్యంలో పుణ్యాహవచనం, అంకురార్పణం, అఖంఢ దీపారాధన, రక్షాబంధనం, నివేదన, హారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గజవాడ రాందాస్‌గుప్త, ఆలయ కమిటీ చైర్మన్ పొద్దుటూరి మహేందర్‌రెడ్డి, సర్పంచ్ గడ్డం రాధ కిష్టారెడ్డి, సొసైటీ చైర్మన్ గజవాడ జైపాల్, ఎంపీటీసీ కొత్తూరు మానస సాయి, ఉప సర్పంచ్ ఆసది రవీందర్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, ఆలయకమిటీ మాజీ చైర్మన్‌లు గజవాడ రాములు, గురడి నర్సారెడ్డి, దువ్వ నర్సయ్య, భక్తులు పాల్గొన్నారు.

**నేడు ధ్వజారోహణం**
సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, భేరిపూజ, దేవతాహ్వానం, నిత్యహోమం, హారతి, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహిస్తారని ఆలయ ప్రధానార్చకులు సుమిత్ శర్మ దేశ్‌పాండే తెలిపారు. రాత్రి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా సీతారాముల ఉత్సవ విగ్రహాలతో హనుమంత సేవ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి తెలిపారు.



డిచ్‌పల్లి ఖిల్లా రామాలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

# కేంద్ర పద్దుపై భిన్నాభిప్రాయాలు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై ప్రజలు మిశ్రమంగా స్పందించారు. బుధవారం ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్‌ ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై పలువురు తమ అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు.

## క్లుప్తంగా

### రేపు మోర్తాడ్‌కు మాతా సుదీక్ష



డిచ్‌పల్లి: సంత్‌ నిరంకారి మిషన్‌ అధిపతి, నిరంకారి సద్గురు మాతా సుదీక్ష, నిరంకారి రాజ్‌పితాజీ శుక్రవారం మోర్తాడ్‌లో జరగనున్న ఆధ్యాత్మిక కార్యక్రమానికి హాజరవుతున్నట్లు జోనల్‌ ఇన్‌చార్జి మోహిని అహుజా తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు మోర్తాడ్‌ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల మైదానంలో మాతాజీ సమక్షంలో నిరంకారి సంత్‌ సమాగం నిర్వహిస్తారని తెలిపారు. భకులందరూ భాగస్వాములు కావాలని కోరారు.

### మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్‌



రెంజల్‌: మండలంలోని నీలా గ్రామ చెరువులో మట్టి తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకున్నారు. బుధవారం గ్రామానికి చెందిన కొందరు చెరువులో తవ్వకాలు చేపట్టి విక్రయిస్తుండటంతో స్థానికులు అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. చెరువులో గుంతల తవ్వడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై పండ్ల సాయన్న అక్కడికి చేరుకుని 3 ట్రాక్టర్లు, జేసీబీని స్టేషన్‌కు తరలించారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో పట్టుబడిన వాహనాలను తహసీల్దార్‌కు సరెండర్‌ చేసినట్లు ఎస్సై వివరించారు.

### జీపీ కార్మికులను ఢీకొన్న ఆటో



ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌ మండలం గోవింద్‌పేట్‌ శివారులో డ్రెయినేజీ శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులను ఆటో ఢీకొంది. భీమ్‌గల్‌ నుంచి ఆర్మూర్‌ వైపు వస్తున్న ఆటో రోడ్డు పక్కన పని చేస్తున్న కార్మికులను వెనుక నుంచి ఢీకొంది. దీంతో ఆటో బోల్తా పడింది. ఇద్దరు కార్మికులు, ఆటోలో ప్రయాణిస్తున్న గర్భిణి గాయపడ్డారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌ తాగి ఉండడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.

### బీమాను సద్వినియోగం చేసుకోవాలి



ఎల్లారెడ్డి: తపాలా శాఖ ద్వారా అమలు చేస్తున్న బీమాను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా పోస్టల్‌ సూపరింటెండెంట్‌ ఉమామహేశ్వర్‌ కోరారు. బుధవారం ఆయన స్థానిక తపాలా కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతు గతంలో పోస్టల్‌ లైఫ్‌ ఇన్సూరెన్సు కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉండేదని, దీనిని ప్రభుత్వం ప్రైవేటు రంగాలలో పని చేస్తున్న వారికి సైతం అవకాశం కల్పించినట్లు తెలిపారు. 19 ఏళ్ల నుంచి 55 ఏళ్లలోపు ఉన్నవారు ఈ పథకాన్ని వినియోగించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో బీపీఎం సునిల్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్సీ ప్రయోజనాలపై దెబ్బ



సుభాష్‌నగర్‌: వేతన జీవులు ఆశించిన విధంగా కేంద్ర బడ్జెట్‌ లేదు. ఆదాయపు పన్ను మినహాయింపు రూ.10లక్షల వరకు పెంచితే బాగుండేది. ఉద్యోగుల డిమాండ్‌ మేరకు మినహాయింపులు చేస్తే మేలు జరిగేది. అరకొర ఐటీ పరిమితి పెంపుతో ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. పీఆర్సీతో జీతాలు పెరిగినా.. ఐటీ దెబ్బకు మూడు నెలల జీతాలు పన్ను రూపంలో చెల్లించాల్సి వస్తుంది.

– కె నాగరాజు, జిల్లా అధ్యక్షులు, తెలంగాణ ఎంప్లాయీస్‌ అసోసియేషన్‌

## ఉపాధ్యాయుల శిక్షణకు డిజిటల్‌ విద్యా విధానం



ఆర్మూర్‌: ఉపాధ్యాయులకు శిక్షణను డిజిటల్‌ విద్యా విధానాన్ని అమలులోకి తీసుకురావడంతో శిక్షణ సమయంలో మరింత లోతైన సమాచారిన్ని ఉపాధ్యాయులు పొందడానికి ఆస్కారం ఉండనుంది. అదేవిధంగా విశ్వకర్మల వికాస్‌ యోజన పథకం ద్వారా వెనకబడిన విశ్వకర్మల ఆర్థిక సంక్షేమానికి ఎంతగానో ఉపయోగకరంగా ఉండనుంది.

– గుండోజి నరేందర్‌, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఆర్మూర్‌

## నిరాశ పరిచింది



బడ్జెట్‌ ప్రజలను నిరాశ పర్చింది. తెలంగాణకు ప్రత్యేక నిధులు కేటాయించలేదు. నిజామాబాద్‌కు డబుల్‌ లైన్‌, కొత్త రైల్వే లైన్‌ పనుల గురించి ప్రస్తావించకపోవడం శోచనీయం. పసుపు బోర్డు ఏర్పాటుకు నిధులు కేటాయించకపోవడం నిరుత్సాహపర్చింది.

– రమేష్‌బాబు, సీపీఎం, జిల్లా కార్యదర్శి, నిజామాబాద్‌

## పేద, మధ్య తరగతి బడ్జెట్‌



కేంద్ర బడ్జెట్‌ పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలకు మేలు చేకూర్చేలా ఉంది. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కేటాయింపులు 400శాతం వరకు పెంచారు. పీఎం ఆవాజ్‌ యోజన పథకానికి రూ. 39వేల కోట్లు కేటాయించటంతో దేశవ్యాప్తంగా ఇండ్ల నిర్మిణాలు బాగా జరిగే అవకాశం ఉంది.

– పీఆర్‌ సోమాని, వ్యాపారవేత్త

## పసుపు బోర్డు ప్రస్తావన లేకపోవడం విచారకరం



ఆర్మూర్‌: జిల్లా రైతాంగం పసుపు బోర్డుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పసుపు బోర్డు ప్రస్తావన లేకపోవడం విచారకరం. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ కోటి మంది రైతులకు సహాయాన్ని అందించడం అభినందనీయమైనప్పటికీ జిల్లా రైతాంగం డిమాండ్‌ అయిన పసుపు బోర్డు ఏర్పాటుపై కేంద్ర ప్రభుత్వం పునరాలోచన చేయాల్సిన అవసరం ఉంది.

– పద్మ మురళి, వ్యాపారి, ఆర్మూర్‌

## వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం



వ్యవసాయ, అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తూ కేటాయింపులు చేయడం శుభ పరిణామం. యువ పారిశ్రామికవేత్తల ద్వారా అగ్రిస్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు అగ్రికల్చర్‌ యాక్సిలరేటర్‌ ఫండ్‌ ఏర్పాటు చేస్తానమ్నారు. – తోకల సంపత్‌, అర్థశాస్త్ర విభాగాధిపతి, తెయూ

## భారీ ఊరట



కేంద్ర బడ్జెట్‌లో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆదాయ పన్ను మినహాయింపుతో భారీ ఊరట కల్పించింది. రూ.ఏడు లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయించడం సంతోషకరం. గిరిజన ప్రాంతంలోని ఏకలవ్య పాఠశాలల్లో 38 వేల టీచర్ల భర్తీకి గ్రీన్‌ సిగ్నల్‌ ఇవ్వడం హర్షణీయం.

– కర్నె శంకర్‌, తపస్‌ రాష్ట్ర ప్రతినిధి, బోధన్‌

## ప్రజావ్యతిరేక పద్దు



కార్పొరేట్‌ కంపెనీలకు ట్యాక్స్‌ మినహాయింపు ఇచ్చారు. ఇది వ్యవసాయ కార్మిక ప్రజావ్యతిరేక బడ్జెట్‌. పారిశ్రామిక రంగంపై స్పష్టత లేదు. పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుంది. విద్యారంగంకు సరైన నిధులు కేటాయించలేదు.

– సుధాకర్‌, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి

## పెన్షనర్లకు నిరాశ



కేంద్ర బడ్జెట్‌ పెన్షనర్లను నిరాశపర్చింది. నెలసరి ఫించన్‌పై ఆధారపడి జీవిస్తున్న పెన్షనర్లపై ఆదాయ పన్ను పూర్తి రద్దు చేయాలని ఏళ్లుగా కోరుతున్నాం. మధ్యతరగతి వర్గాల ప్రజలకు రూ.10 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇస్తారని ఆశించాం. పాత విధానం ప్రకారమే ఆరు స్లాబులు పెట్టి 30 శాతం పన్ను వసూళు చేసి సంపద పోగు చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు 22 శాతం పన్ను విధించడం సమంజసం కాదు.

– అద్దంకి ఉషాన్‌, ఆల్‌ పెన్షనర్స్‌, రిటైర్డు అసోసియేషన్‌ బోధన్‌ డివిజన్‌ ప్రతినిధి

## 'ఉపాధి'కి నిధుల తగ్గింపు



కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీ పనులకు నిధులు తగ్గించారు. ఈ పథకానికి గత బడ్జెట్‌లో రూ.98 వేల కోట్లు కేటాయిస్తే, ప్రస్తుతం రూ.60 వేల కోట్లు కేటాయించారు.

– పి సుధాకర్‌, సీపీఐ జిల్లా కార్యదర్శి, నిజామాబాద్‌

## నిధులు సరిపోవు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన జాతీయ విద్యా విధానానికి ఈ బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవు. జీడీపీలో 6 శాతం నిధులు కేటాయించాలి. విద్యా వైద్య వసతులను కల్పించకపోవడం శోచనీయం.

– పున్నయ్య, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, తెయూ

## బంగారం వినియోగదారులపై ప్రభావం



బంగారు అభరణాలపై ట్యాక్స్‌లు పెంచారు. ఇది వినియోగదారులపై ప్రభావం పడుతుంది. దేశంలో బంగారం దిగుమతులు ఎక్కువగా ఉండటంతో రూపాయి విలువ పడిపోతోంది.

– పోల్దె లక్ష్మీకాంతం, బంగారం వెండి వర్తక సంఘం అధ్యక్షుడు, నిజామాబాద్‌

## హర్షణీయం



ఆర్మూర్‌: ఆదాయపు పన్ను పరిమితిని రూ.ఐదు లక్షల నుంచి రూ.ఏడు లక్షలకు పెంచడం హర్షణీయం. చాలా మంది టాక్స్‌ పేయర్స్‌కు ఊరట లభించనుంది.

– ఈరవత్రి రాజశేఖర్‌, చార్టెడ్‌ అకౌంటెంట్‌, ఆర్మూర్‌

## కేంద్రం వివక్ష చూపుతోంది



కేంద్ర ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోంది. కేంద్ర, రాష్ట్రాల మధ్య తండ్రీకొడుకుల వలె సఖ్యత ఉండాలి. తెలంగాణ నుంచి రూ.3.68లక్షల కోట్ల ఆదాయం తీసుకున్న కేంద్రం తిరిగి రాష్ట్రానికి ఇచ్చింది మాత్రం రూ.1.68లక్షల కోట్లు మాత్రమే. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని నీతిఆయోగ్‌ చెప్పినప్పటికీ ఇవ్వకపోవడం శోచనీయం.

– దాదన్నగారి విఠల్‌రావు, జెడ్పీ చైర్మన్‌

## రూ.3లక్షల నుంచి లెక్కించడం సరికాదు..



కమ్మర్‌పల్లి: పన్ను మినహాయింపును రూ.ఏడు లక్షలకు పెంచి.. ఆదాయం రూ.ఏడు లక్షలు దాటిన వారికి రూ.3 లక్షల నుంచే పన్ను వేయడం సరికాదు. ఏడాదికి రూ. 7.01 లక్షల జీతం ఉన్న ఉద్యోగి రూ. 25 వేల పన్ను చెల్లించాల్సి వస్తుంది.

– కుంట గంగారెడ్డి, సెర్ప్‌ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీఎం

## చేతల్లో చూపించాలి



బడ్జెట్‌లో రైతులకు పంట రుణాల కోసం భారీగా నిధులు కేటాయించడం బాగానే ఉంది. ఆచరణలో అమలు చేస్తే బాగుంటుంది. బ్యాంకులు ఉన్నవారికే రుణాలు ఇస్తున్నాయి.

– బద్దం రాజశేఖర్‌, రైతు, తిమ్మాపూర్‌

## స్వాగతిస్తున్నాం



నిజామాబాద్‌సిటీ: ప్రతీ మధ్యతరగతి కుటుంబానికి రూ.7లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడాన్ని తెలుగుదేశం పార్టీ స్వాగతిస్తోంది. ఇది చాలా మందికి ఊరట కలిగించే విషయం. కేంద్ర ప్రభుత్వం ముున్ముందు పేదల కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటే మరింత బాగుంటుంది.

– దేగాం యాదాగౌడ్‌, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

## మధ్య తరగతికి మేలు



రూ.ఏడు లక్షల వరకు ఆదాయం పన్ను మినహాయింపుతో ఉద్యోగ, ఉపాధ్యాయులతో పాటు మధ్యతరగతి వర్గాల ప్రజలు, చిరు వ్యాపారులకు లబ్ధి చేకూరుతోంది. రూ.ఏడు లక్షలకు మించిన ఆదాయం ఉన్న వారికి ఐదు స్లాబుల్లో పన్ను విధించడం వేతన జీవులకు ఊరట లభిస్తుంది. – ఎంబెల్లి శంకర్‌, పీఆర్‌టీయూ బోధన్‌ డివిజన్‌ అధ్యక్షుడు

## పేదల బడ్జెట్‌



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ పేదలకు వరం లాంటిది. ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడానికి ప్రభుత్వం ఈ బడ్జెట్‌ ప్రవేశపెట్టింది. ఉద్యోగులకు ఆదాయ పన్ను పరిమితి పెంచడం హర్షణీయం. వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది.

– ధన్‌పాల్‌ సూర్యనారాయణగుప్తా, బీజేపీ అర్బన్‌ నియోజకవర్గ నాయకుడు

## ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూర్చేలా..



సమ్మిళిత వృద్ధి చిట్టచివరి వ్యక్తికి కూడా చేకూరేలా బడ్జెట్‌ ఉంది. రూ.ఏడు లక్షల వరకు ఇన్‌కమ్‌ టాక్స్‌ మినహాయింపు ఇవ్వడం మంచి విషయమే. కొత్త పన్ను స్లాబ్‌ విధానాన్ని ఎంచుకున్న వారికి మాత్రమే ఇవ్వడం సరైంది కాదని చెప్పవచ్చు. – పాత నాగరాజు, అసోసియేట్‌ ప్రొఫెసర్‌, తెయూ

## ప్రకృతి సేద్యానికి నిధులు



ప్రకృతి సేద్యానికి ప్రోత్సాహం అందించడానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించడం బాగుంది. రసాయన ఎరువుల వాడకంతో ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. పాత పద్ధతిలో వ్యవసాయం చేయడమే మేలు. – తక్కురి సాగర్‌, రైతు, మోర్తాడ్‌

## విద్యారంగానికి అధిక కేటాయింపులు



కామారెడ్డి అర్బన్‌: కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి పెద్దపీట వేశారు. దేశ వ్యాప్తంగా ఏకలవ్య పాఠశాలలో 38వేల టీచర్ల నియామకం, 740 ఏకలవ్య మోడల్‌ గురుకుల పాఠశాలల ఏర్పాటు, జాతీయ డిజిటల్‌ లైబ్రరీల ఏర్పాటు, యువతకు నైపుణ్యాలు అందించడం, వైద్యవిద్య కోర్సుల్లో మల్టిడిసిప్లినరీ కోర్సులు, ఉపాధ్యాయ విద్యలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం అనుకూల అంశాలుగా ఉన్నాయి. రూ.40వేల కోట్లు విద్యా రంగానికి కేటాయించడం హర్షణీయం. – డాక్టర్‌ బాలు, కామారెడ్డి

## కార్పొరేట్‌ కంపెనీల అనుకూల బడ్జెట్‌



కేంద్ర బడ్జెట్‌ కార్పొరేట్‌ కంపెనీలకు అనుకూలంగా ఉంది. పేద ప్రజలకు వ్యతిరేకంగా ఉంది. నిరుద్యోగులకు నిరాశనే. వ్యవసాయ రంగం దివాలా తీసే విధంగా నిధులు కేటాయించారు.

– వెంకటిగౌడ్‌, సీపీఎం జిల్లా కార్యాదర్శి, కామారెడ్డి

## విద్యా రంగానికి 2.6శాతమే నిధులు



కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యాశాఖకు 10శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.6శాతమే కేటాయించింది. కార్పొరేట్‌ విద్యాసంస్థలకు మేలు జరిగేలా కేంద్రం వ్యవహరిస్తుంది. విద్యకు సంబంధించిన అన్ని వస్తువులపై జీఎస్టీ ఎత్తివేయకుండా అదనపు భారం మోపడం సరికాదు.

– జీవీఎం విఠల్‌, భారతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి

## క్రైం కార్నర్‌

### భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



ప్రవీణ్‌ (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: భార్య కాపురానికి రావడం లేదని జీవితంపై విరక్తి చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కామారెడ్డి మున్సిపల్‌ పరిధిలోని టేక్రియాల్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చెవిటి ప్రవీణ్‌ (30)కు దేవునిపల్లికి చెందిన లాస్యతో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా యేడాదిగా లాస్య తన తల్లిగారింట్లో ఉంటుంది. భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ప్రవీణ్‌ ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దేవునిపల్లి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు.

**జీవితంపై విరక్తితో ఒకరు..**

నవీపేట: మండలంలోని జన్నెపల్లి గ్రామానికి చెందిన బోడ నరేందర్‌(52) బుధవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజారెడ్డి తెలిపారు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసైన నరేందర్‌ తరచూ భార్యతో గొడవ పడేవాడు. దీంతో 15 రోజుల కిందట భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తాగుడికి బానిసై జీవితంపై విరక్తి చెందిన నరేందర్‌ ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు చేశామని ఎస్సై తెలిపారు.

### లారీలో నుంచి పడ్డ చెరుకు



ఇందల్వాయి: నిజామాబాద్‌ నుంచి సదాశివనగర్‌ మండలంలోని గాయత్రి షుగర్‌ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీలో నుంచి చెరుకు కింద పడింది. జాతీయ రహదారిపై మండలంలోని మిషన్‌ భగీరథ వాటర్‌ ప్లాంట్‌ వద్ద బుధవారం మధ్యాహ్నం పెద్ద మొత్తంలో చెరుకు మోపులు కూలి కింద పడటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న టోల్‌ప్లాజా సిబ్బంది చెరుకును తొలగించారు.

### హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని ధర్నా



ముదక్‌పల్లి చౌరస్తాలో ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు

మోపాల్‌: మండలంలోని ముదక్‌పల్లిలో గిరిజన సంక్షేమ హాస్టల్‌లో సమస్యలు పరిష్కరించాలని బుధవారం ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా చేశారు. ఏఐఎస్‌ఎఫ్‌ నాయకులు నవీన్‌ మాట్లాడుతూ హాస్టల్‌ సిబ్బంది మెనూ పాటించడం లేదని, నాసిరకం భోజనం పెడుతున్నారని ఆరోపించారు. అలాగే కిటికీలు, డోర్లు, మూత్రశాలలు సరిగ్గా లేవని, గదుల్లో విద్యుత్‌ తీగలు ప్రమాదకరంగా వేలాడుతున్నాయన్నారు. అధికారులు హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు. నితిన్‌, భాస్కర్‌, చరణ్‌, మనోహర్‌, నితిన్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

### వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని హత్య



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి

బాన్సువాడటౌన్‌: వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఒకరిని హత్య చేశారు. నస్రుల్లాబాద్‌ మండలం అంకోల్‌ గ్రామానికి చెందిన నీరడి శ్రీనివాస్‌(40) హత్య కేసును పోలీసులు ఛేధించారు. బుధవారం బాన్సువాడ రూరల్‌ పోలీ స్టేషన్‌లో డీఎస్పీ జగన్నాథ్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. శ్రీనివాస్‌ భార్యకు అదే గ్రామానికి చెందిన కిషన్‌ గౌడ్‌ అనే వ్యక్తికి వివాహేత సంబంధం ఉంది. ఈ విషయమై పలుమార్లు శ్రీనివాస్‌కు, కిషన్‌గౌడ్‌కు గొడవ జరిగింది. దీంతో ఎలాగైనా శ్రీనివాస్‌ను చంపాలని కిషన్‌గౌడ్‌ పథకం వేశాడు. దీనికోసం బాలయ్య, సురేష్‌గౌడ్‌, కేతవత్‌ రవి, గొట్టం శ్రీకాంత్‌ సాయం తీసుకున్నాడు. గత నెల 29న నీరడి శ్రీనివాస్‌ను బాలయ్య అనే నిందితుడు అంకోల్‌ గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ ఉన్న మిగతా నలుగురు నిందితులు శ్రీనివాస్‌కు అతిగా మద్యం తాగించారు. అనంతరం నోట్లోకి మద్యం సీసాను బలవంతంగా నొక్కి సీసాను కాలితో గట్టిగా తన్నడంతో గొంతులో మద్యం సీసా గుచ్చుకుని శ్రీనివాస్‌ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం అంకోల్‌ క్యాంపు, బాన్సువాడలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. హత్య కేసు ఛేదించిన రూరల్‌ సీఐ మురళి, నస్రూల్లాబాద్‌ ఎస్సై రంజిత్‌రెడ్డితో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారని డీఎస్పీ అన్నారు.

### బైకు అదుపు తప్పి ఇద్దరి మృతి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ధర్పల్లి: బైకు అదుపు తప్పి ఇద్దరు మృతి చెందిన ఘటన ధర్పల్లి మండల కేంద్రం శివారులో చోటుచేసుకుంది. వివరాలు.. సిరికొండ మండలం పెద్దవాల్గొట్‌ గ్రామానికి చెందిన కృష్ణ (48) ఇందల్వాయి మండలం గన్నారం గ్రామానికి చెందిన శ్రీనివాస్‌ (45) ధర్పల్లిలోని దేశాయి బీడీ కంపెనీలో ప్యాకింగ్‌ కార్మికులుగా పనిచేస్తున్నారు. మంగళవారం సాయంత్రం వీరు ఇద్దరూ ధర్పల్లిలో ఒక శుభకార్యానికి హాజరయ్యారు. అనంతరం శ్రీనివాస్‌, కృష్ణను ఇంటి వద్ద దింపడానికి ధర్పల్లి నుంచి పెద్దవాల్గోట్‌ గ్రామానికి బైకుపై బయలుదేరారు. మార్గ మధ్యలో కోళ్ల ఫారం మలుపు వద్ద బైకు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. ఇద్దరికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. బుధవారం ఉదయం మృత దేహాలను చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఈ ప్రమాదం మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో జరిగినట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### చేపల వేటకు వెళ్లి మృత్యువాత

లింగంపేట: మండలంలోని ఒంటర్‌పల్లి గ్రామానికి చెందిన పెద్ది శివయ్య(51) చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. వివరాలు.. శివయ్య మంగళవారం సాయంత్రం గ్రామ శివారులోని కొత్త చెరువులో చేపలు పట్టడానికి భార్య సాయవ్వతో కలిసి వెళ్లాడు. చీకటి పడటంతో భార్య ఇంటికి వచ్చింది. రాత్రి సమయంలో చెరువులో వేసిన గాలాలు తీసే క్రమంలో కాలు జారి శివయ్య చెరువులో పడిపోయాడు. రాత్రి అయినా శివ్వయ్య ఇంటికి రాకపోవడంతో తిరిగి చెరువు దగ్గరకు వెళ్లి చూడగా తాను తీసుకెళ్లిన ఎక్సెల్‌ వాహనం, బట్టలు గట్టుపై ఉన్నాయి. చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం గ్రామస్తులు చెరువులో వెతకగా శివయ్య మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కూతుర్లు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

**బైక్‌పై నుంచి పడి ఒకరు..**

లింగంపేట: లింగంపేట మండలం పొల్కంపేట గ్రామ శివారులో బుధవారం సంఘమేశ్వర్‌(45) అనే వ్యక్తి బైక్‌పై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్సై శంకర్‌ తెలిపారు. వివరాలు.. మెదక్‌ జిల్లా హవేలి ఘన్‌పూర్‌ మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన సంగమేశ్వర్‌ స్వగ్రామంలో పాత టీవీఎస్‌ ఎక్సెల్‌ కొనుగోలు చేశాడు. దానిని రిపేర్‌ చేయించడానికి అదే గ్రామానికి చెందిన చత్తారి చిన్న మల్లయ్య బైక్‌కు తాడు కట్టి లాగుతూ లింగంపేటకు బయలుదేరారు. పొల్కంపేట శివారులోని సబ్‌స్టేషన్‌ సమీపంలో బైక్‌ను వేగంగా తీసుకెళ్లడంతో టీవీఎస్‌ ఎక్సెల్‌ అదుపు తప్పి రోడ్డుపై పడింది. దీంతో సంఘమేశ్వర్‌ తలకు తీవ్ర గాయాలు కాగా ఎల్లారెడ్డి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతుడి భార్య రామవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### కిడ్నాప్‌ కేసు నిందితుల రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై నర్సింలు

సిరికొండ: మండలంలోని గడ్కోల్‌ గ్రామానికి చెందిన గుర్జుకింది సతీష్‌ను కిడ్నాప్‌ చేసిన నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై నర్సింలు తెలిపారు. స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో బుధవారం ఆయన కేసు వివరాలను వెల్లడించారు. భీమ్‌గల్‌కు చెందిన మల్లేష్‌ తన అనుచరులైన శ్రావణ్‌, పూజిత్‌, జింక మహేష్‌, దినేష్‌తో పాటు మరో ముగ్గురి సహాయంతో సతీష్‌ను గత నెల 30న కిడ్నాప్‌ చేశారని తెలిపారు. కిడ్నాప్‌నకు గురైన వ్యక్తిని విడిపించి, నేరస్తులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై తెలిపారు. కిడ్నాప్‌నకు ఉపయోగించిన కారు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు.